నిత్యావసర సరుకులను పరిశీలిస్తున్న కలెక్టర్





స్కీం వర్కర్లపై 'అధికార' బెదిరింపులు అధికం అవుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా స్కీం వర్కర్ల తొలగింపునకు అధికార పార్టీ నేతలు రాజకీయ బెదిరింపుల పర్వానికి తెరలేపారు. ప్రతిపక్షంలో ఉండగా సామాన్యులకు అండగా ఉంటామని హామీలు గుప్పించిన తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తూనే వాటికి తిలోదకాలిచ్చిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మధ్యాహ్న భోజన ఏజెన్సీలు, అంగన్‌వాడీ, ఆశా, ఫీల్డ్ అసిస్టెంట్లు, యానిమేటర్లు ఇలా స్కీరం వర్కర్లను ఏదోలా తొలగించేలా రాజకీయపరమైన ఒత్తిళ్లు చేస్తున్నారు. ఈ వేధింపుల తాళలేక ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో కొందరు స్కీం వర్కర్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు.

తొలగింపు స్కీం వర్కర్లు..!

"శ్రీ సత్యసాయి జిల్లా ఓబుళదేవరచెరువు మండలం వీరప్పగారిపల్లిలో నాగమణి మినీ అంగన్‌వాడీ కార్యకర్తగా పని చేస్తోంది. టిడిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ గ్రామానికి చెందిన టిడిపి మద్దతుదారుడు ఆంజినేయులు అంగన్‌వాడీ కార్యకర్త నాగమణిని విధుల నుంచి తప్పుకోవలని బెదిరించాడు. ఈ బెదిరింపులు వేధింపులు తాళలేక గత నెల 26వ తేదీన నాగమణి పురుగుల మంది తాగి ఆత్మహత్యకు యత్నించింది".

ఆత్మహత్యకు యత్నించిన అంగన్‌వాడీ కార్యకర్త కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

"అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గం వజ్రకరూరు మండలం చాయాపురం గ్రామానికి చెందిన సుంకమ్మ గత 23 ఏళ్లుగా గ్రామ పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికురాలిగా ఉంటూ పిల్లలకు భోజనం అందిస్తోంది. ఇటీవల టిడిపి అధికారంలోకి రావడంతో భోజన ఏజెన్సీని వదిలేయాలంటూ గ్రామానికి చెందిన కొందరు టిడిపి నాయకులు ఆమెను బెదిరించారు. తాను ఎలాంటి వివాదాల్లో లేనని, తన జీవనాధారం దూరం చేయొద్దంటూ ఆమె ప్రాధేయపడింది. అయినా ఏజెన్సీని వదులుకోవాంటూ టిడిపి నాయకులు బెదిరించారు. ఈ బెదిరింపులను తాళలేక మధ్యాహ్న భోజన ఏజెన్సీ గదిలోనే సుంకమ్మ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది".

ఆత్మహత్యకు యత్నించిన మధ్యాహ్న భోజన కార్మికురాలిని పరామర్శిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ప్రభుత్వాలు మారినప్పుడల్లా స్కిమ్ వర్కర్ల మెడపై కత్తి వేలాడుతూ ఉంటోంది. పాత వారిని తొలగించి తమ వారిని చేరుస్తామని ఒత్తిడి పెరుగుతుండటం పరిపాటిగా మారుతోంది. గత ప్రభుత్వంలోనూ ఇదే విధంగా నడవగా, ఇప్పుడు కూడా ఇదే తరహా రాజకీయపరమైన ఒత్తిళ్లు కొన్ని చోట్ల ఉంటుండటం గమనార్హం. తన ఏజెన్సీని తొలగించేందుకు టిడిపి నాయకలు కుట్ర చేయడంతో అనంతపురం జిల్లాలో వజ్రకరూరు మండలంలో మధ్యాహ్న భోజన కార్మికురాలు ఆత్మహత్యా యత్నంకు ప్రయత్నించింది. ఇక సత్యసాయి జిల్లాలో ఓడిసి మండలంలో అంగన్‌వాడీ కార్యకర్త ఒకరు ఆత్మహత్యాయత్నకు ప్రయత్నించింది. ఇలా పాలకులు మారిన ప్రతిసారీ జరుగుతున్న తొలగింపునకు వ్యతిరేకంగా సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం నాడు అనంతపురం, సత్యసాయి జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నాకు పిలుపునిచ్చారు.

స్కీమ్ వర్కర్లపై పెరుగుతున్న రాజకీయ ఒత్తిళ్లు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎనిమిది వేల మందికిపైగా అంగన్‌వాడీ కార్యకర్తలు పనిచేస్తున్నారు. మూడు వేల మంది వరకు ఆశా వర్కర్లు, వెయ్యి మంది వరకు ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు. వీరు కాకుండా మూడు వేల మంది వరకు మధ్యాహ్న భోజన కార్మికులు న్నారు. ఇవే కాకుండా కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులున్నారు. ఇందులో యానిమేటర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులున్నారు. వీరిలో అత్యధిక మందిని ఇప్పటికే తొలగింపులు చేశారు. ఇందులో నిబంధనలు కూడా పాటించలేదన్న విమర్శలున్నాయి. కనీసం నోటీసులు కూడా లేకుండానే ఏకపక్షంగా మార్పులు చేపట్టడం అనేక విమర్శలకు సైతం తావిస్తోంది.

23 ఏళ్లుగా ఏజెన్సీ నిర్వహిస్తున్న నిర్వాహకురాలి తొలగింపు

అనంతపురం జిల్లా వజ్రకరూరు మండలం ఛాయపురంలో సుంకమ్మ 23 ఏళ్లుగా మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకురాలిగా ఉంది. ఇటీవల కూటమి ప్రభుత్వం వస్తూనే ఏజెన్సీ బాధ్యతల నుంచి తప్పుకోవాలని స్థానిక నేతలు ఒత్తిడి చేశారు. దీంతో ఆమె పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది.

5న కలెక్టరేట్ వద్ద ధర్నా

స్కీం వర్కర్లపై రాజకీయ వేధింపులు, అక్రమ తొలగింపులు ఆపాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 5వ తేదీన సిఐటియు ఆధ్వర్యంలో అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టరేట్ల వద్ద ధర్నా చేపట్టనున్నారు. అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, ఫీల్డ్ అసిస్టెంట్, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్, మున్సిపల్ కార్మికులు, యానిమేటర్స్, తదితర స్కీం వర్కర్ల వేధింపులపై ఆపాలని డిమాండ్ చేస్తూ ఈ ఆందోళన కొనసాగునుంది. వీరి ఆందోళనకు పలు కార్మిక, రైతు, ప్రజాసంఘాలు ఇప్పటికే మద్దతు తెలిపాయి.

సత్యసాయి జిల్లాలో అంగన్‌వాడీ కార్యకర్త ఆత్మహత్యాయత్నం

సత్యసాయి జిల్లా ఓబుళదేవరచెరువు మండలంలోని వీరప్పగారిపల్లిలో అంగన్‌వాడీ వర్కరు నాగమణిని విధుల నుంచి తప్పుకోవాలని కొంత మంది స్థానిక నాయకులు ఒత్తిడి చేశారు. దీంతో ఆమె నేతల ఒత్తిడితోనే తాను ఆత్మహత్యాయత్నం చేసుకుంటున్నానని వీడియోను సోషియల్ మీడియాలో పోస్టు చేసి పురుగుల మందు తాగింది. ఇలా రెండు జిల్లాలోనూ స్కీమ్ వర్కర్లపై నేతలు ఒత్తిడి పెంచుతున్నారు. దీనిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న కార్మికుల కుటుంబాలు ఒక్కసారిగా బజారునపడే పరిస్థితి నెలకొంది.

◆ సర్కారు మారినప్పడల్లా సంకటమే

◆ కొత్త ప్రభుత్వాలొచ్చిన ప్రతిసారీ స్కీమ్ వర్కర్లపై ఒత్తిడి

◆ తొలగింపులకు వ్యతిరేకంగా రేపు కలెక్టరేట్‌ల ఎదుట నిరసన

రాజకీయ ఒత్తిళ్లు సరికాదు

ప్రభుత్వాలు మారిన ప్రతిసారీ స్కీమ్ వర్కర్లపై రాజకీయపరమైన ఒత్తిళ్లు తీసుకొచ్చి ఉపాధి నుంచి తొలగించే కుట్రలు చేయడం సరికాదు. కార్మికులను తొలగించే ముందు కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండానే తీసేసి, కొత్త వారిని నియమిస్తున్నారు. ఇది సరైంది కాదు. రాజకీయ పరమైన ఒత్తిళ్లు లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

నాగమణి,
సిటియు జిల్లా అధ్యక్షురాలు, అనంతపురం.

అప్పడలా... ఇప్పడిలానా..?

స్కీం వర్కర్ల తొలగింపులు 2019లో ఇదే రకంగా జరుగుతుంటే తెలుగుదేశం నాయకులు వ్యతిరేకించారు. తొలగింపులు సరైంది కాదంటూ ప్రకటించారు. ఇప్పుడు వారు అధికారంలోకి వస్తూనే కొన్ని చోట్ల తొలగింపులు పెరిగాయి. ఇటువంటి చర్యలను ఖండిస్తూనే సిఐటియు నిరసనకు పిలుపునిచ్చింది. ప్రభుత్వం స్పందించి తొలగింపులను ఆపకపోతే ఐక్యపోరాటాలు చేపడతాం.

ఇఎస్.వెంకటేశ్,
సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి, సత్యసాయి జిల్లా.

అందరికీ నిత్యావసర సరుకులు పంపిణీ

కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ వారి ఇంటి వద్దకే వెళ్లి నిత్యావసర సరుకులు పంపిణీ చేపట్టాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం నగరంలోని ఓల్డ్ టౌన్ 9వ వార్డులో ఎండియు వాహనాల ద్వారా ఇంటి వద్దకే నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిత్యావసర సరుకుల పంపిణీ చేపట్టాలని ఆదేశించారు. ఆయా వార్డుల్లో షెడ్యూల్ ప్రకారం బియ్యం, రాగి పిండి, ఆటా తదితర నిత్యావసర సరుకులను పంపిణీ చేయాలని సూచించారు. ఏదైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. నిత్యావసర సరుకుల పంపిణీలో ఏవైనా సమస్యలు ఉన్నాయా అంటూ వినియోగదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఆర్డీవో వసంతబాబు, డిటి పునీత్, సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్ శ్రీరాములు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

జూనియర్ కళాశాలలో
మధ్యాహ్న భోజనం అమలు చేయాలి : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి-నార్పల

జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి సూర్యప్రకాష్, మండల అధ్యక్ష, కార్యదర్శులు జయకృష్ణ, రహీమ్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ఎస్ఐఎఫ్ మండల కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలో జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించారని, వైసిపి అధికారంలోకి వచ్చాక విస్మరించిందన్నారు. ప్రస్తుతం తిరిగి టిడిపి అధికారంలోకి వచ్చినందు వల్ల కళాశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని అమలు చేయాలని కోరారు. అలాగే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు ఇవ్వాలని, మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల కార్యదర్శిగా జయక్రిష్ణ, అధ్యక్షులుగా రహీమ్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సాయి, వినోద్, గంగాధర్, సాయికుమార్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ వాడకాన్ని నిర్మూలిద్దాం

ఎస్కెయు ఇన్‌ఛార్జి విసి అనిత

ప్రజాశక్తి-అనంతపురం

డ్రగ్స్ వాడకాన్ని నిర్మూలించి విద్యార్థుల ఆరోగ్యాలను కాపాడుదామని ఎస్కెయు ఇన్‌ఛార్జి విసి అనిత పిలుపునిచ్చారు. శనివారం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో డ్రగ్స్ వాడకం ద్వారా వచ్చే దుష్పరిణామాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మత్తు పదార్థాలు వాడకం వల్ల ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. కావున ఎస్కెయు పరిధిలోని ప్రతి విద్యార్థి డ్రగ్స్ మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ వెంకటనాయుడు, కళాశాల ప్రిన్సిపాళ్లుకృష్ణకుమారి, రామచంద్ర, సోమశేఖర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు సదాశివరెడ్డి, సత్యసౌమ్య, రామిరెడ్డి, ధనుంజయ, వర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మురళీధర్, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ ప్రారంభోత్సవం సందర్భంగా మాట్లాడుతున్న ఎస్కెయు ఇన్‌ఛార్జి విసి అనిత

మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి

మేయర్ మహమ్మద్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలోని అన్ని డివిజన్లలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని మేయర్ మహమ్మద్ వసీం సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం నగరంలోని 38, 39, 43, 45వ డివిజన్ల పరిధిలోని 2, 4, 5వ రోడ్లతోపాటు, జన్మభూమి రోడ్డు, లక్ష్మీనగర్, కోవూరునగర్‌లలో మేయర్ పర్యటించారు. ఇందులో భాగంగా 2వ రోడ్డులోని నేతాజీ నగరపాలక పాఠశాలలో ఇన్‌ఛార్జి కమిషనర్ పివివిఎస్.మూర్తితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో అవసరమైన మరమ్మతు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలలో అర్థాంతరంగా ఆగిపోయిన భవన నిర్మాణానికి నగరపాలక జనరల్ ఫండ్ నుంచి టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని సూచించారు. అదేవిధంగా 43వ డివిజన్ పరిధిలో పారిశుధ్య పనులు, 39వ డివిజన్ పరిధిలో డ్రెయినేజీల్లో చేపడుతున్న పూడికతీత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఫాగింగ్ చేయాలన్నారు. మురుగునీరు ఎక్కడా నిల్వ ఉండకుండా చూడాలని ఆదేశించారు. పిఎబిఆర్ డ్యామ్‌లోకి తుంగభద్ర నుంచి వరద నీరు వస్తున్నందున రంగు మారే అవకాశం ఉందన్నారు. కావున తాగునీటిని వేడి చేసుకుని చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కమల్‌భూషణ్, ఇషాక్, లక్ష్మీరెడ్డి, ఇఇ సూర్యనారాయణ, డిఇ రవీంద్రారెడ్డి, సచివాలయ సిబ్బంది

అర్థాంతరంగా ఆగిన పనులను పరిశీలిస్తున్న మేయర్ మహమ్మద్ వసీం

మాట్లాడుతున్న జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ సుజాత

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-అనంతపురం

వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ సుజాత సూచించారు. శనివారం ఉమ్మడి అనంతపురం జిల్లాలోని మలేరియా సబ్ యూనిట్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో డెంగీ, మలేరియా కేసులు పెరిగే అవకాశం ఉంటుందన్నారు. కావున సబ్ యూనిట్ అధికారులందరు అప్రమత్తమై ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా మలేరియా అధికారి ఓబులు, సహాయ మలేరియా అధికారి సత్యనారాయణ, ఉమ్మడి జిల్లాలోని సబ్ యూనిట్ అధికారులు, సూపర్‌వైజార్లు, ఎంపిహెచ్ఇఒలు గిరిధర్‌రెడ్డి, లక్ష్మానాయక్, రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలి

డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

ప్రతి ఒక్కరూ స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. రామకృష్ణ మఠం అనంతపురం శాఖ 20వ వార్షికోత్సవం పురస్కరించుకుని శనివారం స్థానిక ఎస్‌వి.డిగ్రీ కళాశాలలో యువజాగృతి సాహిత్యం, సాంస్కృతిక కార్యక్రమాల ప్రశంసా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానంద మాటలను అమృత వాఖ్యాలుగా తీసుకోవాలన్నారు. అనంతరం యువ జాగృతం ద్వారా వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ యువ అవార్డు గ్రహీత బిసాటి భరత్, రామకృష్ణ మఠం అర్చనానంద మహారాజ్, ఎస్‌వి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, రామకృష్ణ మఠం అనంతపురం వ్యవస్థాపకులు శ్రీధర్‌మూర్తి, సభ్యులు ప్రవీణ్, వేదాద్రి, తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి

పంట నమోదు చేసుకోండి : ఎడిఎ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

ఖరీఫ్‌లో సాగు చేసిన రైతులు పంటలను తప్పనిసరిగా ఈక్రాప్ బుకింగ్ చేసుకోవాలని ఎడిఎ రవి సూచించారు. శనివారం మండల పరిధిలోని రేకులకుంట గ్రామంలో రైతు రామచంద్ర సాగు చేసిన మొక్కజొన్న పంటను ఈక్రాప్ బుకింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ధరకాస్తు ఫారంతోపాటు ఆధార్‌కార్డు, 1బి, పట్టాదారు పాసు పుస్తకం, సెల్ ఫోన్ నెంబర్ తీసుకొచ్చి తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలన్నారు. పంట నమోదు చేసుకుంటేనే బీమా, ఇతర ప్రభుత్వ సౌకర్యాలు వర్తిస్తాయన్నారు. లేకుండా ప్రభుత్వం నుంచి పరిహారం అందన్నారు. కావున రైతులందరూ తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయధికారి శ్యామ్‌సుందర్, విస్తరణ అధికారిణి జ్ఞానజ్యోతి, రైతుసేవాకేంద్రం సహాయకురాలు జ్యోష్ణ, తిరుమలేష్, రైతులు పాల్గొన్నారు.

పుట్లూరు : 2024 ఖరీఫ్‌లో మండలంలో సాగు చేసిన పంటలను ఈ- పంట ద్వారా నమోదు చేసుకోవాలని ఎఒ కాత్యాయని శనివారం ఒక ప్రకటనలో కోరారు. పొలం పాస్ పుస్తకం, ఆధార్ పత్రాలతో సంబంధిత గ్రామ వ్యవసాయ, ఉద్యాన అసిస్టెంట్‌ను సంప్రదించి పంట నమోదు చేసుకోవాలని కోరారు.

పంట నమోదును పరిశీలిస్తున్న ఎడిఎ రవి

కౌలు రైతులకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం రూరల్ మండలం కామారుపల్లి గ్రామపంచాయతీలోని ఆర్‌ఎస్‌కె పరిధిలో ఉన్న కౌలు రైతులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారిణి జె.శశికళ మాట్లాడుతూ భూములను కౌలుకు తీసుకుని సాగు చేసే రైతులు కౌలు గుర్తింపు కార్డులు పొందాలన్నారు. కార్డులు తీసుకోవడం ద్వారా ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలను అర్హులు అవుతారన్నారు. ఈ కార్యక్రమంలో కురుగుంట సర్పంచి లక్ష్మీదేవి, రెవెన్యూ అధికారులు రామకృష్ణ, సాయికిరణ్, వ్యవసాయ విస్తరణ అధికారి బి.మురళీకృష్ణ, గ్రామ వ్యవసాయ సహాయకులు మహేశ్వరి, అనుపమ, గ్రామ రెవెన్యూ సహాయకులు సుబ్రమణ్యం, టిడిపి నాయకులు వెంకటప్ప, సుధీర్, సుధాకర్, నారాయణ, పోతులయ్య, పరమేష్ పెద్దన్న, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

రేషన్ డీలర్లు అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆర్‌డిఒ రాణీసుస్మిత హెచ్చరించారు. శనివారం మండల పరిధిలోని ముదిగల్లు, ఒంటిమిద్ది, గూబనపల్లి, ముదిగల్లు గ్రామాల్లో సిఎస్‌డిటి సుబ్రమణ్యంతో కలిసి రేషన్ దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ డీలర్లు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే సరుకులను విక్రయించాలని ఆదేశించారు. అలాగే షాపుల ముందు ధరల పట్టిక ఏర్పాటు చేయాలన్నారు.

ముదిగల్లులో రేషన్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఆర్‌డిఒ రాణీసుస్మిత

పుట్లూరు మండలంలో కేక్ కోస్తున్న టిడిపి నాయకులు

గార్లదిన్నెలో కేక్ కోస్తున్న టిడిపి నాయకులు

నార్పలలో కేక్ కోస్తున్న ఆలం, నాయకులు

నార్పల మండలం వృద్ధాశ్రమంలో కేక్ కోస్తున్న టిడిపి నాయకులు

బండారు శ్రావణిశ్రీ సారథ్యంలోనే నియోజకవర్గం అభివృద్ధి

ప్రజాశక్తి-పుట్లూరు

టిడిపి నాయకులు ఎల్‌కె.చెన్నారెడ్డి, పి.పుల్లారెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా కేక్ కోసి కార్యకర్తలకు పంచిపెట్టారు. తర్వాత ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు మండల కన్వీనర్ బాలరంగయ్య, డిసి ఓబుళనాయుడు, ఓబుళాపురం శ్రీనివాసనాయుడు, గూడురు విజయకుమార్‌రెడ్డి, గోపురాజుపల్లి వెంకటసుబ్బారెడ్డి, రవికుమార్‌రెడ్డి, బాలాపురం రామచంద్రారెడ్డి, శ్రీనివాసులునాయుడు, నారాయణస్వామి, పుట్లూరు శివనారాయణరెడ్డి, మల్లికార్జునరెడ్డి, ఎల్లె.గోపాల్‌రెడ్డి, నారాయణరెడ్డిపల్లి రామమునిరెడ్డి, నాయకునిపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, చింతకుంట జయరామిరెడ్డి, కడవకల్లు గోవర్ధనరాజు, ఓబుళాపురం ప్రసాద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అలాగే కడవకల్లు ఎంపిపి పాఠశాలలో విద్యార్థులకు బిస్కెట్లు, కేకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గోవర్ధనరాజు, చింతకుంట జయరామ్‌రెడ్డి, ఓబుళాపురం ప్రసాద్, చెర్లోపల్లి శీన, నరేష్, కడవకల్లు మల్లికార్జున, వెంకటస్వామి, రామన్న, రంగస్వామి, బ్రాండీ షాప్ కుళ్లాయప్ప, చెట్ల శివారెడ్డి, బెస్త వెంకట్రాముడు, గంగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాలినడకన తిరుమలకు వెళ్లిన ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

శింగనమల : ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ కుటుంబ సమేతంగా కాలినడక వెళ్లి శ్రీవారి మొక్కు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యేగా గెలిస్తే కాలినడక తిరుమలకు వస్తానని మొక్కుకున్న మేరకు శనివారం పుట్టిన రోజును పురస్కరించుకుని కాలినడకన తిరుమలకు వెళ్లి కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

శ్రీవారి దర్శణానికి వెళ్తున్న ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు

తాడిపత్రిలోని శివకృష్ణ సాయి వృద్ధాశ్రమంలో వృద్ధులకు చీరలు, పంచలు పంపిణీ చేశారు. తర్వాత అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సుదర్శన్‌నాయుడు, నాయకులు శివశంకర్‌రెడ్డి, లక్ష్మయ్య, రమేష్‌బాబు, నాగేశ్వర్‌రెడ్డి, రవిచంద్రనాయుడు, వెంకటరమణ, వెంకటనాయుడు, పెద్దయ్య, దస్తగిరి, భాస్కర్‌నాయుడు, కుళ్లాయప్ప, రామాంజినేయులు, చంద్ర, పెద్దిరాజు, రామానాయుడు, శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : అలాగే టిడిపి జిల్లా నాయకులు ఆలం వెంకట నరసానాయుడు ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయ ఆవరణలో కేక్ కోసం పంచిపెట్టారు. అనంతరం తిరుపతిలో ఉన్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీకి ఫోన్ ద్వారా టిడిపి రాష్ట్ర నాయకులు ఆలం నరసానాయుడు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తర్వాత కస్తూరిబా పాఠశాలలో విద్యార్థినులకు పెన్నులు పంపిణీ చేశారు. అనంతరం శ్రీసత్యసాయి అనాథాశ్రమంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పిట్టు రంగారెడ్డి, ఆలం నాగార్జుననాయుడు, ఎర్రినాగప్ప, రాఘవనాయుడు, చంద్రబాబు, లక్ష్మీనారాయణ, తలారి కుళ్లాయప్ప, జావీద్, రాజన్న, మహేష్, ప్రతాప్‌గౌడ్, చంద్రశేఖర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, బొగ్గు నారాయణస్వామి, నాగార్జున, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మండల కేంద్రంలోని నూతన టిడిపి కార్యాలయంలో టిడిపి నాయకులు ఆకుల ఆంజనేయులు, ఆకుల ప్రసాద్, ఆకుల విజయకుమార్ ఆధ్వర్యంలో భారీ కేక్ కోసం పంచిపెట్టారు. ముందుగా పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం శ్రీ సత్యసాయి అనాథాశ్రమంలో కేక్ కోశారు. అన్నదానం ఏర్పాటు చేశారు. కురుగానపల్లి దగ్గర ఉన్న చెన్నకేశవ వృద్ధాశ్రమంలో వృద్ధులకు భోజనం ఏర్పాటు చేశారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ సభ్యులు ఆకుల కిషోర్, ఆకుల అనిల్, ఆకుల తేజ, తిప్పన్న, సాయినాథ్, గూగూడు ఓబులేసు, ఇస్మాయిల్, రాధాకృష్ణ, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నె : ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పుట్టినరోజును పురస్కరించుకుని టిడిపి నాయకులు, కార్యకర్తలు శనివారం మండల కేంద్రంలో కేక్ కోసి పంచిపెట్టారు. తర్వాత శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు బ్రెడ్డు, పాలు పంచిపెట్టారు. అదేవిధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు బ్రెడ్డు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గుత్తా హరి, రమణప్ప, చల్ల నాగరాజు, ఓబిరెడ్డి, శివశంకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి-నార్పల

తల్లిపాల ప్రాధాన్యతపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూపర్‌వైజర్ సునాలిని సూచించారు. శనివారం మండల కేంద్రంలోని సుల్తాన్‌పేట, ఉయ్యాలవాడ-2 అంగన్వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు అమృతం లాంటివి అన్నారు. కావున ప్రతి ఒక్కరూ పుట్టిన గంటలోపు పిల్లలకు తల్లిపాలు పట్టించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు శ్రీదేవి, రేణుక, హెల్త్ అసిస్టెంట్ మునిరెడ్డి, ఏఎన్ఎం పవిత్రమ్మ, మహిళా పోలీస్ చాంద్ ఉస్మాని, ఆశావర్కర్లు మంజుల, రమణమ్మ, వెంకటలక్ష్మి, తస్లీమ్, తదితరుల పాల్గొన్నారు.

వారోత్సవాల్లో వక్తలు

నార్పలలో తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్న అంగన్వాడీలు, మహిళలు, చిన్నారులు

పామిడి : స్థానిక సంత మార్కెట్ వీధిలోని 17వ అంగన్వాడీ సెంటర్‌లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య శాఖ సూపర్‌వైజర్ శ్రీరామిరెడ్డి, ఏఎన్ఎం సంతోషమ్మ, ఆశావర్కర్లు భానుమతి, సరస్వతి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రామలక్ష్మి, అంగన్వాడీ టీచర్లు రెహనాజ్‌బేగం, అనిత, అంగన్వాడీ హెల్పర్ రత్నమ్మ, తల్లులు, గర్భిణులు, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : తల్లిపాలే బిడ్డకు శ్రేష్టకరమని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఉమాదేవి తెలిపారు. శనివారం మండల పరిధిలోని ఈస్ట్ నరసాపురం అంగనవాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పి.ఉమాదేవి అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిపాలే మొదటి టీకా అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం పద్మావతి, మహిళా పోలీస్ నాగవేణి, అంగన్వాడీ కార్యకర్త ప్రశాంతి, హెల్పర్ కుళ్లాయమ్మ, తల్లులు, పిల్లలు, తదితరులు పాల్గొన్నారు.

వజ్రకరూరు : ముర్రుపాలతోనే చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు విజయ తెలిపారు. శనివారం విడపనకల్ మండల పరిధిలోని గడేకల్, పాల్తూరు గ్రామాలతోపాటు వజ్రకరూరు మండల కేంద్రంలోని కొనకొండ్ల-2, బోడిసానిపల్లి గ్రామాల్లో ఏఎన్ఎం పద్మావతి, సుకన్య ఆధ్వరంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది సుభాన్‌బి, రమేష్‌బాబు, ఎంఎల్‌హెచ్‌పి మణి, అంగన్వాడీ టీచర్లు విజయ, ఈరమ్మ, మల్లేశ్వరి, ఆదిలక్ష్మి, రాధ, నాగవేణి, దుర్గాదేవి, లక్ష్మీదేవి, ఎం.సువర్ణ, ఆశావర్కర్లు శాంతమ్మ, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

విద్యతోపాటు ఆరోగ్యంపై జాగ్రత్తలు అవసరం : డా॥తేజస్వి

ప్రజాశక్తి-వజ్రకరూరు

విద్యార్థులు చదువుతోపాటు ఆరోగ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వ వైద్య అధికారి తేజస్వి సూచించారు. శనివారం వజ్రకరూరు మండల కేంద్రంలోని కొనకొండ్ల గ్రామంలో ఉన్న మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ చికున్‌గున్యా, డెంగీ, మలేరియా, ఇతర కీటక జనిత వ్యాధులు నియంత్రణ తదితర విషయాలపై విద్యార్థులకు వివరించారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. అతిసారకు కారణమైన కలుషిత నీరు, ఆహారం గురించి చేతుల శుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జోనాథన్, హెల్త్ అసిస్టెంట్ బాబావలి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో పండ్లు, బ్రెడ్లు పంపిణీ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మండల మండల కేంద్రంలోని శివాలయంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కేక్ కోసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పసుపుల హనుమంతురెడ్డి, పొడరాళ్ల రవీంద్ర, దండువారిపల్లి ఆదినారాయణ, ఓబుళపతి, జొన్నా రామయ్య, కెకె అగ్రహారం రాము, బాబా ఫక్రుద్దీన్, కొత్తపల్లి గంపన్న, తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రంలో కేక్ కోస్తున్న టిడిపి నాయకులు

ఆసుపత్రిలో పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

అలాగే అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ సి.తిరుపాలు, ఎస్సీ, ఎస్టీ పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోలూరు బండారు కుళ్లాయప్ప, ఎంఆర్‌పిఎస్ జిల్లా అధికార ప్రతినిధి మండల పక్కీరప్ప, ఎస్సీ, ఎస్టీ పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు హెచ్.లింగమయ్య, నవీన్, రాము, తదితరులు పాల్గొన్నారు.

అలాగే తెలుగు యువత నాయకులు కిరణ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో రక్తదాన శిబిరంతోపాటు, పలు సేవా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా దాదాపు 150 నుంచి 200 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు, ఐటిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శింగనమల : శింగనమల గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎ.మసూద్‌వలి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని రామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత కేక్ కోసం పంచిపెట్టారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మాసూల చంద్రమోహన్, సి.వెంకటేష్, పెద్ద నాగముని, రాఘవరెడ్డి, బోయ సత్యనారాయణ, బండి వెంకటనారాయణ, ఎం.ఆదినారాయణ, రాజశేఖర్‌యాదవ్, శంకర్, జడేజా, కాయల సురేష్, వీర, మహేష్, శివ, సత్తి, ప్రకాష్, ఎర్రిస్వామి, నాగరాజు, వీరాంజి, ఫక్రుద్దీన్, మిట్ట పవన్, వడ్డే అంజి, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

అలాగే పెరవలి గ్రామంలో టీడీపీ యువ నాయకులు పుచ్చకాయల రాము ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా భారీ కేకు కోసి కార్యకర్తలకు పంచి పెట్టారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ పేదల పెన్నిధి అయిన ఎమ్మెల్యే శ్రావణిశ్రీ ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకుని పేదలకు సేవ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పోకూరి శ్రీనివాసులు, సాదిక్‌వలి, నాగరాజు, వరదరాజులు, యువత కురుబ నారాయణస్వామి, బలిజ లక్ష్మీనారాయణ, మురళి, పెద్దన్న, బాలకుల్లాయప్ప, జగ, రాజ, భారీగా కార్యకర్తలు పాల్గొన్నారు.

శింగనమల మండలం పెరవలిలో కేక్ కోస్తున్న టిడిపి నాయకులు

ఆసుపత్రిలో పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న శింగనమల టిడిపి నాయకులు

సకాలంలో మార్కుల జాబితాలు ఇవ్వాలి

వైఎస్ఆర్ విద్యార్థి నాయకుల వినతి

ప్రజాశక్తి-అనంతపురం

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో డిగ్రీ, పీజీ విద్యార్థుల ప్రొవిజినల్ మార్కుల మెమోల సర్టిఫికెట్లు అందజేయడంలో ఆలస్యాన్ని నివారించాలని వైఎస్ఆర్ విద్యార్థి సంఘం నాయకులు కోరారు. ఈమేరకు శనివారం స్థానిక కార్యాలయంలో ఎస్‌కెయు ఇన్‌ఛార్జి విసి అనితను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వైసిపి విద్యార్థి సంఘం నాయకులు హేమంత్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు మార్కుల మెమోల కోసం దరఖాస్తు చేసుకుని దాదాపు మూడు నెలలు కావస్తున్నా ఇవ్వలేదన్నారు. అభ్యర్థులు కాళ్లు అరిగేలా తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎందుకు ఆలస్యం అవుతుందంటే నెట్ పని చేయలేదని సమాధానం చెబుతుండడం చాలా బాధాకరమన్నారు. అధికారులు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం మంచిది కాదన్నారు. కావున తక్షణమే స్పందించి మార్కుల జాబితాలను అందించేదుకు చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ విద్యార్థి నాయకులు పి.హేమంత్‌కుమార్, హరి, శివ, భరత్, జయంత్, చంద్రహాస్, తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్‌కెయు ఇన్‌ఛార్జి విసి అనితకు వినతిపత్రం సమర్పిస్తున్న వైఎస్ఆర్ విద్యార్థి సంఘం నాయకులు

యాదవులు అన్నిరంగాల్లో రాణించాలి

రాయదుర్గం రూరల్ : యాదవులు ఐక్యమతంగా అన్నిరంగాల్లో రాణించాలని యాదవ సంఘం నియోజకవర్గ అధ్యక్షులు శంకర్ పిలుపునిచ్చారు. శనివారం మండల పరిధిలోని ఆవులదట్లలో మండల యాదవ సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా ఆంజనేయులు, నాగప్ప, రామకృష్ణ, కృష్ణమూర్తి, మండల అధ్యక్షులుగా మల్కాపురం తిమ్మారెడ్డి, ఉపాధ్యక్షులుగా ఆవులదట్ల వన్నూరుస్వామి, సీజీ దొడ్డి మల్లేశప్ప, ప్రధాన కార్యదర్శిగా కదరంపల్లి బొజ్జప్ప, ఆవులదట్ల ఆంజనేయులు, ప్రచార కార్యదర్శిగా ఈరన్న, సీజీ దొడ్డి తిప్పి, ట్రెజరర్‌గా వంశీ, బిఎన్.హళ్లి శ్రీనివాసులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

6 నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు

రాయదుర్గం : శ్రావణమాసం సందర్భంగా ఈనెల 6వ తేదీ నుంచి హనుమాన్ దర్శనం కోసం ప్రత్యేక ఆర్టీసీ బస్సు సర్వీసులు నడపనున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ సురేష్ శనివారం ఒక ఒక ప్రకటనలో తెలిపారు. శ్రావణమాసంలో ప్రతి మంగళ, శనివారాలలో రాయదుర్గం నుంచి మురడి, నేమకల్లు, కసాపురం ఆంజనేయస్వామి ఆలయాలకు హనుమాన్ దర్శనం కోసం బస్సు సర్వీసులు నడపనున్నట్లు తెలిపారు. ఈనెల 6, 10, 13, 17, 20, 24, 27, 31వ తేదీల్లో సర్వీసు ఎక్స్‌ప్రెస్, అల్ట్రా డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సులు నడుస్తాయన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తహశీల్దార్ బాధ్యతల స్వీకరణ

పామిడి : పామిడి మండల తహశీల్దార్‌గా శ్రీధర్‌మూర్తి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కర్నూలు జిల్లా మంత్రాలయం నుంచి బదిలీపై పామిడికి వచ్చారు. గతంలో ఇక్కడ పని చేసిన చంద్రశేఖర్‌నాయక్ నంద్యాల జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ రెవెన్యూపరమైన సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మీనారాయణరెడ్డి, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది తహశీల్దార్‌కు పుష్పగుచ్ఛాన్ని అందించి శాలువాతో సత్కరించారు. కాగా టిడిపి, బిజెపి, జనసేన నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాలు కప్పి పూలమాలలతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కత్రిమల ప్రభాకర్‌చౌదరి, బొల్లు శ్రీనివాసరెడ్డి, ఆర్ఆర్.రమేష్, జింకల సంజీవ, గౌస్‌పీరా, రాజేష్‌నాయక్, బొమ్మ మోహన్, విజయభాస్కర్, మహమ్మద్ రఫీ, నిమ్మకాయల శీన, పల్లె శ్రీనివాసులు, దాసు, హమాలీ గోపాల్, రాజు, బాలరాజు, వడ్డే శివ, నల్లబోతుల శీనా, తదితరులు పాల్గొన్నారు.

పామిడి తహశీల్దార్‌కు బొకే అందజేస్తున్న సిబ్బంది

శింగనమల తహశీల్దార్ బ్రహ్మయ్య

శింగనమల : మండల తహశీల్దార్‌గా బ్రహ్మయ్యను నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన ఎన్నికల ముందు రాయదుర్గం నియోజకవర్గ పరిధిలోని గుమ్మఘట్ట తహశీల్దార్‌గా విధులు నిర్వహించారు. ప్రస్తుతం జరిగిన బదిలీల్లో శింగనమల తహశీల్దార్‌గా నియమించారు.

సర్వసభ్య సమావేశం

యాడికి : స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ భవనంలో మండల అధ్యక్షురాలు ఉమాదేవి బొంబాయి రమేష్‌నాయుడు అధ్యక్షతన శనివారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా సంబంధిత అన్ని శాఖల అధికారులు అభివృద్ధిపై చదివి వినిపించారు. అనంతరం ఎంపిటిసి నాగరాజు, రామ్మోహన్, కోటి చిన్న వెంకటరాముడు, సర్పంచి సంజీవరాయుడు తదితరులు సమస్యలపై తమ గళం విప్పారు. గండికోట ద్వారా సరఫరా అవుతున్న తాగునీరు ప్రస్తుతం ఆగిపోయినా, ప్రత్యామ్నాయ మార్గంలో చాగల్లు రిజర్వాయర్ నుంచి సరఫరా చేసే ఏర్పాట్లు ప్రభుత్వం చేస్తుందని అధికారులు తెలిపారు. అలాగే విద్యుత్ సరఫరాలో తరచూ వస్తున్న అంతరాయాలు ప్రజలకు ఇబ్బందికరంగా మారాయని పలువురు ప్రజా ప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఉమాదేవి, ఎంపిడిఒ సావిత్రి, ఇఒఆర్‌డి వెంకటేశ్వర్లు, సిఐ నాగార్జునరెడ్డి, సూపరింటెండెంట్ నాగేశ్వర్‌రెడ్డి, వైస్ ఎంపిపిలు చెన్నప్ప, రసీదా బేగం, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్త మృతికి నివాళి

బ్రహ్మసముద్రం : టిడిపి కార్యకర్త రామప్పగారి లింగప్ప (56) మృతి తీరనిలోటు అని బైరవానితిప్ప ప్రాజెక్టు మాజీ ఛైర్మన్ సుభాన్ అన్నారు. లింగప్ప అనారోగ్యంతో మృతిచెందడంతో విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో మాజీ ఎంపిటిసి నాగరాజు, మాజీ డీలర్ యుహెచ్.తిప్పేస్వామి, చాకలి ఎర్రిస్వామి, ముద్దుల రామాంజి, మాజీ వార్డ్ సభ్యులు ఆంజనేయులు, వెంకటేశులు, సిద్దేశ్, రామ్మోహన్, పూలచెర్ల సుధాకర్, జనసేన నాయకుడు తిమ్మరాజు, తదితరులు ఉన్నారు.

కెవికె కోఆర్డినేటర్‌గా చిన్నరాయుడు

కళ్యాణదుర్గం : స్థానిక కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్‌గా చిన్నరాయుడు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకూ పని చేస్తున్న కోఆర్డినేటర్ రాధాకుమారి బదిలీపై నంద్యాలకు వెళ్లగా ఆమె స్థానంలో కదిరి వ్యవసాయ పరిశోధన ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న చిన్నరాయుడును నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల శ్రేయస్సు కోసం అహర్నిశలు కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా ఆధునిక పద్ధతుల్లో పంటల సాగు, సేంద్రీయ ఎరువుల వాడకం, తదితర వ్యవసాయ రంగా అనుబంధ అంశాలను రైతులతో మమేకమవుతామని వివరించారు.

నేడు చౌడేశ్వరి జయంతి

రాయదుర్గం : పట్టణంలోని నేసేపేటలో ఉన్న చౌడేశ్వరీదేవి ఆలయంలో జయంతి ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త గట్టు శ్రీరాములు, ఆలయ కమిటీ అధ్యక్షులు సిరిమాలు కృష్ణమూర్తి, తొగట వీర క్షత్రియ సంఘం అధ్యక్షులు మద్దిలేటి ప్రభాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లవారుజామున 5 గంటల నుంచి అమ్మవారికి పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, అష్టోత్తర నామావళి, కుంకుమార్చన, ఒడిబియ్యం కట్టే కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఎస్పీని కలిసిన జనసేన నాయకులు

అనంతపురం : నూతనగా బాధ్యతలు స్వీకరించిన ఎస్పీ కెవి.మురళీకృష్ణని జనసేన నాయకులు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షులు టిసి.వరుణ్, జిల్లా ఉపాధ్యక్షులు అంకే ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శులు ఇండ్ల కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

బొమ్మనహాల్ : మండల పరిధిలోని నేమకల్లు ఆంజనేయ స్వామి ఆలయంలో హుండీ ద్వారా భక్తులు సమర్పించిన కానుకలను ఉరవకొండ ఆలయాల ఇన్స్‌పెక్టర్ రాణీ, ఆలయ అధికారి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో శనివారం లెక్కించారు. ఇందులో భాగంగా రూ.15,37,970 ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.

నారసింహుడిని దర్శించుకున్న జడ్జి

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని మల్లాపురం సమీపంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని రాయదుర్గం సివిల్ కోర్ట్ జడ్జి రమ్య శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పాలకుల నిర్లక్ష్యం..!



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఒకవైపు ప్రకృతి కోపం... మరోవైపు పాలకుల నిర్లక్ష్యం వెరసి అనంతపురం జిల్లావాసులకు కష్టాలు తెచ్చిపెడుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగానే కాకుండా పక్కనున్న కర్నాటక, కేరళ రాష్ట్రాలనూ వర్షాలు ముంచేతుత్తుంటే అనంతపురం జిల్లాలో మాత్రం చినుకు నేల రాలడం లేదు. ఖరీఫ్ సాగుకు కీలకమైన జులై నెలలో 64 శాతం వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో వేరుశనగ పంట సాగు జరగలేదు. ఒక్క అనంతపురం జిల్లాలోనే ఐదున్నర లక్షల ఎకరాల వరకు పంట పొలాలు బీడుగానున్నాయి. సత్యసాయి జిల్లాలో నాలుగు లక్షల ఎకరాల వరకు ఇదే పరిస్థితి ఉంది. ఇంత పెద్దఎత్తున పంటలు సాగవకుండా ఉంది. ఆగస్టులో పడుతున్నా అరకొర వర్షాలుగానే నమోవుతూ ఉన్నాయి. ఈనేపథ్యంలో అధికారులు ఆగస్టులో వర్షాలు పడితే కనీసం ప్రత్యామ్నాయ పంటల సాగుకైనా అవకాశముంటుందని అంచనా వేస్తున్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వం వైపు నుంచి ప్రత్యామ్నాయం పంటల వైపు ఆలోచన కూడా కనిపించడం లేదు. ఇదిలా ఉంటే పాలకుల శాపంతో సాగునీరు కూడా రావడం లేదు. ఒకవైపు తుంగభద్ర డ్యామ్, మరోవైపు శ్రీశైలం జలాశయం పూర్తిగా నిండి గేట్లు కూడా ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. పోతున్న నీళ్లను అత్యధికంగా వర్షాలు పడని అనంతపురం జిల్లాకు తెచ్చుకోలేని పరిస్థితి నెలకొంది. ఎందుకంటే తుంగభద్ర డ్యామ్ ద్వారా నీరు తెచ్చుకోవాలంటే నీరొచ్చే ప్రధాన ఎగువ పరిస్థితి దయనీయంగా ఉంది. ఎక్కడ గండ్లు పడతాయోనని కొద్ది కొద్దిగా నీటిని డ్రా చేసుకోవాల్సి వస్తోంది. కనీస మరమ్మతులు కూడా లేకుండా ఉండటంతో నీటిని పూర్తి స్థాయిలో తీసుకోలేకపోతున్నారు. ఇక శ్రీశైలం నుంచి హంద్రీనీవా ద్వారా నీరు తీసుకునే అవకాశముంది. కర్నూలు జిల్లాలో హైవే పనుల కోసమని కాలువను పూడ్చటంతో నీటిని తీసుకోలేకపోతున్నారు. ఆ నీటిని తీసుకోగలిగితే జిల్లాలో చాలా వరకు సాగు,తాగునీటి కష్టాలు తొలగే అవకాశముండింది. ఇలా పాలకుల శాపంతో జిల్లావాసులకు ఇక్కట్లు తప్పడం లేదు. ఇంకోవైపు గతేడాది ఖరీఫ్ పంట నష్టానికి సంబంధించి రావాల్సిన పంటలబీమా కూడా మంజూరవలేదు. ఎప్పటికిస్తారో కూడా తెలియదు. ఈ సంవత్సరం బీమా పరిస్థితి ఏమిటో కూడా తెలియటం లేదు. ఇప్పటి వరకు పంటలబీమా విధనంపై స్పష్టత లేదు. ఈ విధంగా అటు ప్రకృతి, ఇటు పాలకుల విధానాలు జిల్లా రైతాంగానికి శాపంగా మారాయి. ఈవారంలో ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు మడకశిర మండలంలోని గుండుమలలో పర్యటించారు. నేరుగా గ్రామస్థులతో మాట్లాడారు. అప్పుడు వక్క, పట్లు రైతుల సమస్యలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వాటి పట్ల సానుకూలంగా ఆయన స్పందించారు. వక్క రైతుల సమస్యలను అధ్యయనం చేసి పరిష్కారం చూపుతామని హామీనిచ్చారు. ఇదే సమయంలో హంద్రీనీవా ప్రాజెక్టును పూర్తి చేస్తామని హామీనిచ్చారు. ఈ వారంలో మండల స్థాయి అధికారుల బదిలీలు కొనసాగుతున్నాయి. తహశీల్దార్లు, సిఐల బదిలీలు పూర్తయ్యాయి. మొత్తం జిల్లా స్థాయి నుంచి మండల స్థాయి వరకు అందరి బదిలీలు పూర్తయ్యాయి.